సాక్షి
వికారాబాద్
బుధవారం ׀ 16 ׀ అక్టోబర్ ׀ 2024



'ఇందిరమ్మ'కు పోటాపోటీ

అధికార కాంగ్రెస్ పార్టీలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన కమిటీల ఏర్పాటులో నేతల మధ్య లొల్లికి దారితీశాయి. 10లో▸



తాళం వేసిన ఇళ్లకు కన్నం

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా గుర్తు తెలియని దుండగులు ఒకే రాత్రి ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. 10లో▸



ఎందుకీ బస్ షెల్టర్?

హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. 11లో▸

న్యూస్‌రీల్

రాడార్ స్టేషన్ ఏర్పాటుపై పునరాలోచన చేయాలి

బీఆర్ఎస్వీ నాయకులు



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

తాండూరు టౌన్: దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును కేంద్రం పునరాలోచన చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ కోరారు. రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మంగళవారం పట్టణంలో నల్లబ్యాడ్జీలతో నిరశన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక ఔషధ మొక్కలు, పశుపక్షాదులకు నిలయమైన దామగుండం అడవిలోని లక్షలాది చెట్లను నరికి రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. స్టేషన్ నుంచి వెలువడే రేడియేషన్‌తో అడవిలోని జంతుజాలానికి, సమీప ప్రాంతాల ప్రజలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు భానుప్రసాద్, సాయి, నరేష్, రమేష్, అరవింద్, వినయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలకు ప్రతిపాదనలు

కొడంగల్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలకు కాంగ్రెస్ నాయకులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కోరుతున్నారు. జిల్లాలోని కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు 14వేల ఇళ్లను మంజూరు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వేర్వేరుగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు, మహిళా సంఘం సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజా ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. వీరంతా కమిటీగా ఏర్పడి అర్హులను గుర్తిస్తారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారు. ఖాళీ స్థలం ఉంటే రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. తుది దశకు చేరిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించే అవకాశం ఉంది. కమిటీలను అధికారికంగా ఏర్పాటు చేసిన తర్వాత విధి విధానాలను ప్రకటించే అవకాశం ఉంది.

పది రూపాయల నాణేలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

బంట్వారం: పది రూపాయల నాణేల వాడకంపై తొర్మామిడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్ మిశ్రా మంగళవారం గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్బీఐ నిబంధనల మేరకు పది రూపాయాల నాణేలు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. కొంత కాలంగా నాణేలపై లేనిపోని అపోహలు సృష్టించి వాడటం లేదన్నారు. పది రూపాయల కాయిన్స్‌పై ఆర్బీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. వాటిని వ్యాపారులు తిరస్కరించరాదని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సచిన్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

18న ప్రమాణ స్వీకారం?



సమావేశంలో ఏఎంసీ నూతన సభ్యులు

కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వం కొత్త పాలక మండలిని ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 18న ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని నూతన సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన అంబయ్య గౌడ్‌ను, ఉపాధ్యక్షుడిగా దుద్యాల మండలానికి చెందిన ఆకారం వేణును, మరో 13 మందిని సభ్యులుగా ప్రకటించారు. వీరు మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులోని కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రమాణం స్వీకారం, అభివృద్ధి పనుల గురించి చర్చించారు. బుధవారం హైదరాబాద్ వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డిని కలిసి వారి అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు. అధిష్టానం నుంచి అనుమతి రాగానే ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని వారు తెలిపారు.




రాడార్ స్టేషన్ శంకుస్థాపనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండాసురేఖ, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు టీఆర్ఆర్, బీఎంఆర్, యాదయ్య

దామగుండం.. కీర్తి పతాకం



దేశ రక్షణకు పునాది

- రాడార్ స్టేషన్ నిర్మాణంతో జాతీయ స్థాయిలో గుర్తింపు
- వీఎల్ఎఫ్‌కు శంకుస్థాపన చేసిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్: రాడార్ స్టేషన్ ఏర్పాటుతో దామగుండం పేరు ఒక్కసారిగా జాతీయ స్థాయిలో వెలుగు వెలిగింది. దేశ కీర్తిపతాకలో వికారాబాద్ జిల్లా మురిసింది. పూడూరు మండలం దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో భారత నావికాదళానికి చెందిన వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) రాడర్ స్టేషన్ నిర్మాణానికి తర్జనభర్జన మధ్య పదిహేనేళ్ల అవరోధాలు తొలగి పునాదిరాయి పడింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. 'దేశ రక్షణలో హైదరాబాద్ ఎంతో వ్యూహాత్మక ప్రదేశం.. కీలకం కూడా.. రక్షణ వ్యవస్థలో ముఖ్యమైన నేవీ రాడార్ స్టేషన్ ఈ ప్రాంతంలో ఏర్పాటు కానుంది.. జాతి రక్షణలో వికారాబాద్ కూడా కీలకం కానుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రజలకు నష్టం జరుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ నేవీ సంస్థ ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో మూడో వంతు సీట్లు స్థానికులకు కేటాయించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. దామగుండం దేవాలయం సెంటిమెంటును గౌరవించాలని కోరారు. భక్తులు ఆలయానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని, వారి విశ్వాసాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నా. తాను, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ జిల్లా వాసులమేనని ఇక్కడ నేవీ రాడార్ ప్రాజెక్టును ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇందుకోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. నావికా దళ ప్రధానాధికారి దినేష్ కే త్రిపాఠి మాట్లాడుతూ.. 2,900 ఎకరాల్లో ఏర్పాటు చేసే వెరీ లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ దేశ రక్షణలో ఎంతో కీలకం కానుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయే తప్ప ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

సంతోషంగా ఉంది: టీఆర్ఆర్

'మన ప్రాంతంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు నాతో పాటు నేవీ అధికారులు పదిహేనేళ్ల పాటు కృషి చేశారు.. ఇప్పుడు ఆ కల నెరవేరడం సంతోషంగా ఉంది' అని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం జయంతి రోజున ఈ ప్రాజెక్టును జాతికి అంకింత చేయడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు మనకు, మన ప్రాంతానికి ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, రమేష్ మహరాజ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

సైడ్‌లైట్స్..

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లలో దామగుండం రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించక పోవడంతో రోడ్డు మార్గాన వచ్చారు.
- వికారాబాద్‌కు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకోవాల్సిన అతిథులు 1.30 గంటలకు చేరుకున్నారు.
- దామగుండం సభాస్థలికి 1.35 గంటలకు వచ్చారు.
- 1.40 గంటలకు రాడార్ స్టేషన్ ఏర్పాటుకు జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకం వేశారు.
- 1.50 గంటలకు అతిథుల ప్రసంగాలు మొదలయ్యాయి.
- సీఎం రేవంత్‌రెడ్డి 1.50 నుంచి 2.10 గంటల వరకు ప్రసంగించారు.
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 2.10 నుంచి 2.38 గంటల వరకు ప్రసంగాన్ని కొనసాగించారు.
- సభాస్థలిలోనే భోజనాలు ముగించుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గాన వికారాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- ముందుగా రాజ్‌నాథ్‌సింగ్ ఆర్మీ హెలికాప్టర్‌లో బయలుదేరగా ఆ తర్వాత నేవీ అధికారులు మరో ఆర్మీ హెలికాప్టర్‌లో వెళ్లారు.
- సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మరో ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- 350 మంది సివిల్ పోలీసులు, 150 మంది ఇతర పోలీసులు, 28 మంది ఆర్మీ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎస్పీ నారాయణరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



కార్యక్రమంలో పాల్గొన్న నేవీ అధికారులు, నాయకులు, ప్రజలు

రోడ్డు మార్గాన వచ్చి.. ఆకాశ మార్గాన పయనం

అనంతగిరి/పూడూరు: నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో వికారాబాద్‌కు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన దామగుండం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు హుటాహుటిన భద్రత ఏర్పాట్లలో మార్పులు చేశారు. శంకుస్థాపన ముగిసిన తర్వాత హైదరాబాద్ వెళ్తున్న అతిథులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, మల్టీజోన్ –2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు, ట్రైనీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

కొత్త టీచర్లకు పోస్టింగ్



ఉపాధ్యాయుడికి ఆర్డర్ కాపీ అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కౌన్సిలింగ్‌లో పాఠశాలలు కేటాయింపు
- పత్రాలు అందజేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: డీఎస్సీ- 2024లో ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించారు. ఉదయం ప్రారంభం కావాల్సిన కౌన్సిలింగ్ ప్రక్రియ ఆలస్యంగా మొదలై రాత్రి దాకా సాగింది. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఈఓ రేణుకాదేవి కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎస్ఏలు, ఎల్‌పీ (హిందీ), ఎస్ఏ (హిందీ), ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యూకేషన్) మినహా ఎస్‌జీటీలు, ఎల్‌పీలు, పీఈటీలు, పీడీల కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించిన పత్రాలను కలెక్టర్ అందజేశారు.

తప్పులు సరిచేస్తానని తప్పుడు దారి

- పాసుపుస్తకంలో సవరణకు డబ్బులు డిమాండ్
- రైతు నుంచి రూ.6.42 లక్షలు వసూలు
- ఓ రికార్డు అసిస్టెంట్ నిర్వాకం
- తహసీల్దార్‌కు బాధిత రైతు ఫిర్యాదు

షాద్‌నగర్: 'పట్టాదారు పాసుపుస్తకంలో తప్పులు వచ్చాయి.. సరిదిద్దండి సారూ' అంటూ ఓ రైతు అధికారికి మొరపెట్టుకున్నాడు.. ఇదే అవకాశంగా సదరు అధికారి డబ్బులు వసూలు చేశాడు.. అయినా పనికాకపోవడంతో బాధిత రైతు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులకు చెందిన కావలి అంజయ్యకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 575లో 2.17 ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకంలో తప్పులు సరిచేయాలని సదరు రైతు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న బూర్గుల గ్రామానికి చెందిన పోలె నరేందర్‌ను ఆశ్రయించాడు. దీంతో తప్పులను సరి చేసేందుకు అతను భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ మేరకు రైతు రూ.6.42 లక్షలు సమర్పించుకున్నాడు. ఆరు నెలలు కావస్తున్నా పనికాకపోవడం.. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో తిరిగితిరిగి వేసారిన రైతు చేసేది లేక మంగళవారం తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పాసు పుస్తకంలో తప్పులను సవరించాలని, పోలె నరేందర్ నుంచి డబ్బులు తిరిగి ఇప్పించి ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారధిని వివరణ కోరగా రైతు ఫిర్యాదుపై విచారణ చేపట్టి ఆర్డీఓ, కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు.

విద్యుత్ శాఖలో బది'లీలలు'

మహేశ్వరం/తుక్కుగూడ: విద్యుత్ శాఖలో ఇటీవల చేపట్టిన బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కందుకూరు డివిజన్ కింద ఆమనగల్లు, తల్లకొండపల్లి, మాడ్గుల, మహేశ్వరం, కడ్తాల్, పహాడీషరీఫ్, బాలాపూర్ మండలాలు వస్తాయి. ఈ డివిజన్ పరిధిలో 40 మంది లైన్‌మెన్లు, 15 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి ఉద్యోగులు బదిలీ కావాల్సి ఉంది. ఇందులో గ్రామీణ ప్రాంతంలో పని చేసే వారిని అర్బన్‌కి హెచ్ఆర్ఏ (హౌస్ రెంట్ అలవెన్స్) వచ్చే ప్రదేశానికి, అర్బన్ నుండి గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేయాలి.

'అర్బన్' కోసం అడ్డదారులు

ఈ డివిజన్‌లో పని చేసే వారిలో ఆశాఖ కందుకూరు డీఈఈ ఈ నెల 11న 13 మంది లైన్‌మెన్లు ఏడుగురు లైన్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశాడు. వీరు ఈ ఏడాది మేలోనే బదిలీ కావాల్సి ఉండగా ప్రభుత్వ నిర్ణయం కారణంగా జాప్యం అయ్యింది. వీరిలో ఆరుగురు లైన్‌మెన్లు, ఐదుగురు లైన్‌ఇన్‌స్పెక్టర్లు అర్బన్ నుంచి గ్రామీణ ప్రాంతానికి బదిలీ కావాలి ఉంది. కానీ వీరు హెచ్ఆర్ఏ కోసం అర్బన్ ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. ఇందు కోసం లక్షల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఒక్కో ఉద్యోగి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు కాసులకు కక్కుర్తి పడి తీసుకున్న నిర్ణయం మూలంగా గ్రామీణ ప్రాంతంలో పని చేస్తున్న సీనియర్ ఉద్యోగులు నష్టపోతున్నారు. ఇటీవల బదిలీ అయిన ఉద్యోగుల్లో చాలామంది పదేళ్ల నుంచి అర్బన్ ప్రాంతంలో పని చేస్తూ.. తిరిగి అక్కడికే ట్రాన్స్‌ఫర్ కావడం విశేషం.

ఉద్యోగుల ఆగ్రహం

కందుకూరు డివిజన్‌లో బదిలీలపై విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, బదిలీ అయిన ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు జరగలేదని విమర్శిస్తున్నారు. బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేసినట్లు ఆరోపిస్తున్నారు. హెచ్ఆర్ఏ నుంచి నాన్ హెచ్ఆర్ఏకు బదిలీ చేయాలని, దానికి విరుద్ధంగా బదిలీ చేసినట్లు మండిపడుతున్నారు. డీఈఈ రాజారాంరెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని, తనకు నచ్చిన వారికి .. వారు కొరుకున్న చోటకు బదిలీలు చేపట్టారని కొంత మంది ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి విద్యార్థిని ఆదుకున్న ఎన్ఆర్ఐ

కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేత



షాద్‌నగర్‌రూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ఫూర్తితో పేదింటి విద్యార్థిని మెడిసిన్ చదువుకు ఆర్థిక సాయం అందించేందుకు ఎన్ఆర్ఐ ముందుకు వచ్చారు. షాద్‌నగర్‌కు చెందిన బైరమోని మేఘన అనే విద్యార్థిని మెడిసిన్ ఫస్టియర్ ఫీజును ఎన్ఆర్ఐ శ్రీనివాస్ పొట్టి చెల్లించారు. షాద్‌నగర్‌కు చెందిన రమేశ్, మంజుల దంపతులకు మేఘన సహా ముగ్గురు ఆడపిల్లలు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వాస్పత్రి వద్ద చిన్న టిఫిన్ సెంటరే ఈ కుటుంబానికి ఆధారం. చదువులో టాపర్ అయిన మేఘన ఇటీవల మెడిసిన్‌లో సీటు సాధించింది. అయితే ఆమె చదువుకు కావాల్సిన ఫీజు కట్టే స్థోమత కుటుంబానికి లేదు. ఈ విషయం కేటీఆర్ దృష్టికి రావటంతో మేఘన చదువుకు సాయం అందిస్తానని మాటిచ్చారు. కేటీఆర్ చేస్తున్న సాయంలో తాను కూడా భాగం అవుతానంటూ ఎన్ఆర్ఐ శ్రీనివాస్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మేఘన కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడారు. మంగళవారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో కేటీఆర్ చేతుల మీదుగా మేఘనకు రూ.40వేల నగదును అందజేశారు.

'సీజనల్'పై అప్రమత్తంగా ఉండాలి



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం

కొడంగల్ రూరల్: జీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ సదానందం సూచించారు. మంగళవారం పట్టణంలోని పశు వైద్యశాలలో జీవాలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు అందించారు. సబ్సిడీ యంత్రాలు, గడ్డి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కృత్రిమ గర్భధారణతో పశువులు అధికంగా పాలిచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆవులు, గేదెలు, తెల్లజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, దీంతో పాల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, కాలి గిట్టల్లో పుండ్లు, నోటిలోని చిగురులో బొబ్బలు తదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఏడీ డాక్టర్ నోవా, రావులపల్లి పశువైద్యాధికారి డాక్టర్ పరమేష్, మున్సిపల్ సిబ్బంది భరత్, ఆంజనేయులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



ప్రకాశ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

కుల్కచర్ల: మండల కేంద్రంలోని నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు ప్రేంప్రకాశ్‌రెడ్డి రూ.51వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవసమాజం సంఘం నాయకులు ప్రకాశ్, వీరేశం, రవిచందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్



శ్రీనివాస్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండల పరిధిలోని హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ హస్తం గూటికి చేరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల, కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకులంలో పీజీటీ మ్యాథ్స్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ సోషల్, జూనియర్ లెక్చరర్ మ్యాథ్స్, జూనియర్ లెక్చరర్ జువాలజీ, పీడీ పోస్ట్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 19వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21న రాజేంద్రనగర్‌లోని గురుకుల ప్రధాన కార్యాలయంలో డెమో, ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. పీజీ, బీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు.

పంట నమోదులో నిర్లక్ష్యం వహించొద్దు

డీఏఓ మోహన్‌రెడ్డి



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి

దోమ: పంట నమోదులో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని డీఏఓ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని శివారెడ్డిపల్లిలో ఆయన రైతుల పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. అధికారులు ప్రతీ రైతుకు సంబంధించిన ఈ క్రాప్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏ రైతు ఏ పంటలు సాగు చేశారో వాటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతీ రైతుకు తాను సాగు చేసిన పంటల విషయంలో వివిధ రకాల సూచనలు తెలియజేయాలని, రైతుకు నష్టం వాటిల్లకుండా అధికారులు మెలకువలకు తెలపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్‌రావు, ఏఈఓలు బాబ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’కు పోటాపోటీ

- కమిటీల్లో చోటు కోసం నాయకుల ఆరాటం
- సహచరులకు అవకాశం దక్కేలా ఎత్తులు
- 32 జీపీల్లో ఏకగ్రీవం, 7 జీపీల నుంచి రెండేసి జాబితాలు



బషీరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీలో ఇందిరమ్మ కమిటీలు నేతల మధ్య లొల్లికి దారితీశాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ వీటి ద్వారానే అమలు చేస్తామని ప్రకటించడంతో.. కమిటీలో తమ అనుచరులకు చోటు కల్పించాలని పార్టీలోని పాత, కొత్త నాయకుల మధ్య పోటీ నెలకొంది. దీంతో పోటాపోటీగా జాబితాలను తయారు చేసి అధికారులకు అందజేశారు. దీంతో ఏ లిస్ట్‌ను పరిగణనలోకి తీసుకోవాలో తెలియక అధికారులు తల పట్టుకుంటున్నారు.

మేజర్ జీపీల్లో తెగని పంచాయితీ

బషీరాబాద్ మండలంలో 39 పంచాయతీలకు గాను 46 జాబితాలు ఎంపీడీఓ కార్యాలయానికి అందాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీలో ప్రత్యేక అధికారి చైర్మన్‌గా మరో ఐదుగురికి చోటు కల్పించారు. ఇందులో ఇద్దరు డ్వాక్రా మహిళలు, ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ, ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి. అయితే కమిటీలకు ప్రత్యేక అధికారం ఇవ్వడంతో గ్రామాల్లోని నాయకులతో పాటు మండల స్థాయి నాయకులు తమ అనుయాయులకు స్థానం కల్పించేందుకు పోటీ పడ్డారు. మండలంలోని 32 జీపీల్లో కమిటీలను ఏకగ్రీవం చేశారు. బషీరాబాద్, క్యాద్గీరా, కొర్విచెడ్, కొర్విచెడ్ గని, మైల్వార్, జీవన్గీ, రెడ్డిఘణాపూర్ పంచాయయతీల్లో నాయకుల మధ్య పోటీ పెరిగి రెండేసి జాబితాలు అధికారులకు అందజేశారు. వీటితో పాటు మరి కొన్ని గ్రామాలకు చెందిన నాయకులు లిస్టులు తయారు చేసి నేరుగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఇచ్చి పార్టీ కోసం పనిచేసిన తమకే అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్తగా నాయకులు ఎవరికి వారే జాబితాలను తయారు చేసి అధికారులకు ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి అక్కడక్కడ నేతలను ఒప్పించిన మేజర్ పంచాయతీల్లో మాత్రం పంచాయితీ తెగలేదు.

ఏడు పంచాయతీల్లో డబుల్ వచ్చాయి

మండలంలోని ఏడు పంచాయతీల్లో రెండేసి జాబితాలు అందాయని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మిగిలిన గ్రామాల నుంచి ఒకే లిస్ట్ వచ్చిందన్నారు. నాయకులు, గ్రామస్తులు కూర్చుని సామరస్యంగా చర్చించుకోవాలని, గ్రామాభివృద్ధి కోసం ఒక్క కమిటీని మాత్రమే ఎన్నుకోవాలని కోరారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ సిబ్బంది

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం దివంగత రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీజేఎంయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి హన్మంతుముదిరాజ్



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హన్మంతుముదిరాజ్

పరిగి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ అన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని వెంటనే విలీనం చేయాలని కోరారు. 2013కు సంబంధించిన బాండ్ల డబ్బులు కొంత మంది ఉద్యోగులకు రాలేవని వాటిని విడుదల చేయాలన్నారు. ఇందుకు స్పందించిన మంత్రులు త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ తదితరులు ఉన్నారు.

● భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవం



దర్గా వద్ద భక్తజనం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచలో మహబూబ్ సుభాని దర్గా ఉర్సు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి గ్రామంలోని మసీదు నుంచి గంధం, జెండాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఉత్సవాలకు కరన్‌కోట్, ఓగిపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్‌తో పాటు కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి ఉర్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుభాన్‌రెడ్డి, రవిశంకర్ పటేల్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

పొలంలో పడి యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)



పొలంలో ప్రశాంత్ మృతదేహం

మొయినాబాద్: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పొలంలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గొరెల్లి ప్రశాంత్(25)కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ తగాదాల కారణంగా మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ప్రశాంత్ మద్యానికి బానిసయ్యాడు. పదేళ్ల క్రితం ఆయన తల్లి మరణించింది. అప్పుడప్పుడు ప్రశాంత్ తల్లి సమాధి వద్దకు వెళ్లి వచ్చేవాడు. మంగళవారం మధ్యాహ్నం సైతం సమాధి వద్ద కాసేపు ఉండి తిరిగి వస్తుండగా గట్టుపై నుంచి జారి బోర్లా పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తలరించారు. మద్యం మత్తులో ఉన్న ప్రశాంత్ బోర్లాపడిపోయి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

నాంపల్లి: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) చందానగర్–హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుగు, ఎరుపు గీతల చొక్కా, నీలం రంగు ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 9000394635 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కూలీ బలవన్మరణం



మల్లేశ్ మృతదేహం

మీర్‌పేట: మద్యానికి బానిసైన ఓ కూలీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. పెంజర్ల గ్రామానికి చెందిన కె.మల్లేశ్ సెప్టెంబర్ 7 నుంచి బడంగ్‌పేటలో ఒంటరిగా నివాసం ఉంటూ.. కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన ఆయన సోమవారం రాత్రి ఇంట్లోని దూలానికి తాడుతో ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం ఆధారంగా మంగళవారం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి సంబంధీకులుంటే ఠాణాలో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కిడ్నాప్ కేసులో నిందితులకు రిమాండ్

కడ్తాల్: వ్యాపారిపై దాడి చేసి కిడ్నాప్‌నకు పాల్పడిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను మంగళవారం సీఐ శివప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఈ ఘటనకు ఇద్దరి వ్యాపారుల మధ్య లావాదేవీలే కారణంగా తేల్చారు. వనపర్తి జిల్లా పానగల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన వ్యాపారి పిట్ల కతల్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నిమిత్తం వ్యాపారి కతల్‌తో పాటుగా ఆయన కుమారుడు శ్యామ్‌కుమార్, బావమరిదితో కలిసి వెల్దండ పీఎస్‌కు బయలుదేరారు. పని చూసుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద బద్రి అలియాస్ అన్వేశ్, అఫ్రోజ్, సురేశ్, కొండల్‌లు వారి కారును ఆపి రాళ్లతో దాడి చేశారు. కతల్‌ను కారు నుంచి బయటకు ఈడ్చి విచక్షణారహితంగా దాడి చేసి దుండగులు ముందే సిద్ధం చేసుకున్న కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ వెనుక వావిళ్ల సంజీవ్‌కుమార్ హస్తం ఉందని కతల్ కుమారుడు శ్యామ్‌కుమార్ వెంటనే కడ్తాల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 6న నిందితులు ఏ2 అన్వేశ్ అలియాస్ బద్రి(చంద్రయాన్‌పల్లి), ఏ3 నిజాముద్దీన్(లింగారెడ్డిపల్లి), ఏ4 మహ్మద్ అఫ్రోజ్(లింగారెడ్డిపల్లి), ఏ6 సూగూరి సురేశ్(చంద్రయాన్‌పల్లి)ను రిమాండ్‌కు తరలించారు. కిడ్నాప్‌నకు వాడిన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏ1 నిందితుడు వావిళ్ల సంజీవ్‌కుమార్(పోతేపల్లి), ఏ5 కోడెల కొండల్ (బర్కట్‌పల్లి గ్రామం)ను ఈనెల 14న రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పగలు రెక్కీ.. అర్ధరాత్రి పశువుల చోరీ

ఇద్దరు నిందితులకు రిమాండ్

షాద్‌నగర్‌రూరల్: పగటిపూట బైక్‌పై వ్యవసాయ క్షేత్రాల వద్ద రెక్కీ నిర్వహిస్తూ అర్ధరాత్రి పశువులను తరలిస్తున్న ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామానికి చెందిన నందిగామ శ్రీధర్, వడ్ల శివకుమార్ కొంతకాలంగా పశువులను దొంగతనం చేస్తున్నారు. ఇటీవల వీరు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లి, వెల్జర్ల, కేశంపేట మండలం వేములనర్వ గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన పశువులను దొంగతనం చేశారు. ఈ నెల 10న వెల్జర్లకు చెందిన రైతు గడ్డం రాఘవేందర్‌కు చెందిన పశువులు దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన ఆయన 11న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ఆవులు, లేగ దూడ, టాటా ఏస్ వాహనంతో పాటుగా రెక్కీకి ఉపయోగించే బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కొత్త సార్లు.. వస్తున్నారు

- ఉమ్మడి బొంరాస్‌పేటకు పది మంది ఎస్‌ఏల కేటాయింపు
- నేడు తరగతి గదుల్లోకి రానున్న ఉపాధ్యాయులు



చిలుముల్ మైలారం ప్రభుత్వ పాఠశాల

బొంరాస్‌పేట/దుద్యాల్: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని రేగడిమైలారం, చిల్ముల్‌మైలారం ఉన్నత పాఠశాలలకు ఐదేసి ఎస్‌ఏ పోస్టులు మంజూరు చేసి, తాజా డీఎస్సీలో పది మంది ఉపాధ్యాయులనిచ్చారు. రేగడిమైలారం ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం బయోసైన్స్ ఉండగా నూతనంగా తెలుగు, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, సాంఘికశాస్త్రం పోస్టులు, చిల్ముల్‌మైలారంలో తెలుగు, ఆంగ్లం, గణితం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం పోస్టులు మంజూరయ్యాయి. ఈమేరకు ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. బుధవారం వీరు విధుల్లోకి చేరుతున్నారు. కొత్త పంతుళ్ల రాకతో కోలాహలం నిండనుంది. సీఎం నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరత ఉందంటూ సాక్షిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందుకు సంబంధించిన క్లిప్పింగ్‌లు సీఎం దృష్టికి వెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

పంతుళ్లరాక కలగానే భావించిన తరుణంలో కొత్త పోస్టులు మంజూరు చేసి, ఉపాధ్యాయులను నియమించడం పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం తపస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్, శంకరప్ప, తేజస్విని తదితరులు సీఎం, డీఈఓ, ఎంఈఓ రాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లకు కన్నం

- ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ
- 29.2 తులాల బంగారం, 46 తులాల వెండి ఆభరణాలు, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు
- భయాందోళనలో సుల్తాన్‌పూర్ గ్రామస్తులు



భారతమ్మ ఇంట్లో దుండగులు ధ్వంసం చేసిన బీరువా

పరిగి: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా గుర్తు తెలియని దుండగులు ఒకే రాత్రి ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గున్నమొల్ల శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి దసరా పండుగకు అత్తవారింటికి వెళ్లాడు. తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలోని ఐదు తులాల బంగారు, 23 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన కోతూరి శ్రీనివాస్ రాత్రి భోజనం తర్వాత వేరే గదిలో పడుకోగా తాళం వేసిన రూంలో చొరబడిన దొంగలు తొమ్మిది గ్రాముల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. కొల్లూరు భారతమ్మ కుటుంబ సభ్యులు పక్కగదిలో నిద్రించగా.. గది తాళం పగులగొట్టి బీరువాలోని 6.2 తులాల బంగారు, మూడు తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బుడ్డయొల్ల నర్సింలు తాళం వేసి ఊరెళ్లగా ఆయన ఇంట్లోని రూ.50 వేల నగదు, తొమ్మిది గ్రాముల బంగారం చోరీకి పాల్పడ్డారు. అనంతరం వెంకటయ్య ఇంట్లో చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామంలో ఒకే రోజు ఐదు చోరీలు జరగడంతో గ్రామస్తులంతా భయాందోళనకు గురవుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారం సాగక అప్పులు

ఫర్టిలైజర్ షాపు యజమాని బలవన్మరణం



శివకుమార్ మృతదేహం

అనంతగిరి: తాను నిర్వహిస్తున్న వ్యాపారంలో అప్పులు ఎక్కువ కావడంతో ఓ ఫర్టిలైజర్ దుకాణ యజమానికి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన ప్రకారం.. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన శివకుమార్(31) కోటపల్లిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా దుకాణం సరిగా కొనసాగక అప్పులు చేశాడు. అప్పుల బాధతో సతమవుతున్న ఆయన మనస్తాపంతో వికారాబాద్ మండలం మైలార్‌దేవరాంపల్లి సమీపంలో తన కారులోనే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

సరస్వతీ పుత్రికలకు సన్మానం

ఎంబీబీఎస్ సీటు సాధించిన అక్కాచెల్లెళ్లు



ఎంబీబీఎస్ సీటు సాధించిన అక్కాచెల్లెలను సన్మానిస్తున్న గ్రామస్తులు

దోమ: మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన కోళ్ల భార్గవి, అనూష ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ మేరకు మంగళవారం వారిని గ్రామానికి చెందిన కోళ్ల హన్మయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉన్నత చదువులు చదివే అభ్యర్థులను గుర్తించాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేయని సందర్భాలు ఉన్నాయన్నారు. వారిని గుర్తించి ఎంబీబీఎస్ సీటు వచ్చేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాదయ్య, వినయ్, అరుణ్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అప్పులు

- తీర్చేందుకు చోరీలు
- వృద్ధురాలిపై దాడి చేసి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు అరెస్ట్
- పది తులాల బంగారు ఆభరణాలు, కారు, ఐఫోన్ సీజ్
- కేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: జల్సాలకు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన యువకులు అప్పులు చేసి.. వాటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు, ఎస్‌ఐ తేజంరెడ్డితో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేపీవీ రాజు కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం, రామన్నగూడెం గ్రామానికి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థి ఊట్కూరి ప్రభాస్(20) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని మైత్రి లహరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి గుండ్లపల్లి శివ(19)తో ఇన్‌స్టాగ్రాంలో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. జల్సాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యారు. వీటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 10న కొహెడ గ్రామంలో ఓ కారును అద్దెకు తీసుకుని కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలో ఒంటరిగా ఉంటున్న దేవరశెట్టి సమతమ్మ వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె నోరు మూసి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు, చేతులకున్న బంగారు గాజులు లాక్కొని పారిపోయారు. ఆమె వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వగా డీసీపీ సునీతారెడ్డి ఆదేశాల మేరకు ఏసీపీ పరిధిలోని ఆరు స్టేషన్ల క్రైం సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కారు కోహెడ గ్రామానికి చెందినదిగా గుర్తించి దర్యాప్తు చేపట్టి ప్రభాస్, శివను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆరుతులాల పుస్తెలతాడు, నాలుగు తులాల బంగారు గాజులు, కారు, కత్తెర, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐలతోపాటు సిబ్బంది సుందరయ్య, ఇంతియాజ్, శేఖర్, శ్రీను, ప్రభును ఏసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి

ఉన్నత విద్యావంతులే చోరీలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇబ్రహీంపం ఏసీపీ పరిధిలో చోటు చేసుకున్న మూడు చోరీల్లో నిందితులంతా ఉన్నత విద్యను అభ్యసించిన వారే. జల్సాలు, ఆన్లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలవుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడిక, ప్రవర్తనపై దృష్టి సారించాలి. అపరిచిత వ్యక్తులు రాత్రిళ్లు తలుపుతడితే తీయొద్దు. పక్కింటి వారికి, డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం